క్లుప్తంగా

భరోసా సభకు తరలిరండి

ముధోల్: బీఎస్పీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 7న నిర్వహించే తెలంగాణ భరోసా సభకు తరలి రావాలని ఆ పార్టీ ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడు నల్ల రవికుమార్, ఇన్‌చార్జి జంగ్మే దేవిదాస్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కోశాధికారి దత్తు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో జెడ్ల రాజారాం అనే రైతుకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మరణించింది. బాధితుడి వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున వర్షం కురువగా గేదె పగ్గంతో తెంపుకొంది. విద్యుత్ తీగ ఇనుప కంచెపై పడింది. దీంతో సదరు కంచె దాటుతుండగా షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.35 వేలు ఉంటుందని,, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో స్రవంతి

నిర్మల్‌చైన్‌గేట్: తప్పులు లేని ఓటర్ జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ జాబితా నమోదు అధికారి, నిర్మల్ ఆర్డీవో స్రవంతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ డీటీగా మంజుల



ఖానాపూర్: ఖానాపూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా మంజుల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఫారుఖ్ బదిలీపై కలెక్టరేట్ వెళ్లగా..పెంబి డీటీగా పని చేస్తున్న మంజుల బదిలీపై ఖానాపూర్‌కు వచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన

కుంటాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం సీపీఆర్‌పై సిబ్బందికి హెచ్‌ఈవో వేణుగోపాల్‌రావు అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడే విధానం వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ దుర్గాభవానీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి



కూలీలతో పనిచేస్తున్న జెడ్పీటీసీ జానుబాయి

ఖానాపూర్: పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్‌లో పనులు చేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కూలి డబ్బులు సక్రమంగా రావడం లేదని కూలీలు పేర్కొనగా.. సంబంధిత అధికారులతో మాట్లాడతానని జెడ్పీటీసీ హామీ ఇచ్చారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

గొర్రెల పెంపకంపై అవగాహన

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామంలో మంగళవారం గొర్రెల పెంపకంపై పెంపకందారులకు ఎంపీడీవో సురేశ్‌బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెంపకందారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెటర్నరీ సర్జన్ రవీందర్, ఏపీఎం గురుచరణ్, భుజంగరావుపాటిల్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉన్న పండ్ల దుకాణాలను మంగళవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. రోడ్డుపై ఉన్న పలువురి పండ్ల డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణ సీఐ మల్లేష్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రాకుండా రోడ్డుపై చిరువ్యాపారుల దుకాణాలు తొలగించినట్లు పేర్కొన్నారు.

మే డే వేడుకలు

సోన్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. మంగళవారం మండలంలోని కడ్తాల్ బీడీ ఫ్యాక్టరీ ఆవరణలో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనాలు పెంచి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఉత్తమ్, మురళి, చిన్నయ్య, రాజు, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

కలగానే బైపాస్‌రోడ్డు నిర్మాణం

- వడ్యాల్, లక్ష్మణచాందలో ముందుకు సాగని పనులు
- మండల ప్రజలకు తప్పని ఇబ్బందులు



మండల కేంద్రంలోని ఇరుకు రోడ్డు



వడ్యాల్‌లో ఇరుకు రోడ్డు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో బైపాస్ రోడ్డు నిర్మించాల్సి ఉండగా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. కొన్ని చోట్ల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2016లో పనులు ప్రారంభం..

మండలంలోని కనకాపూర్ గ్రామం నుంచి లక్ష్మణచాంద వరకు తొమ్మిది కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణ పనులు రూ.9 కోట్లతో ప్రారంభించారు. కానీ వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లో రెండున్నర కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు పనులు చేపట్టకుండా వదిలేశారు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండటంతో పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అయితే బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం అధికారులు గతంలోనే ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ పనులు మాత్రం జరగడం లేదని మండల వాసులు అంటున్నారు.

రెండు గ్రామాల్లో నిలిచిన పనులు..

వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లో ఇరుకుగా ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తే ఇళ్లు కోల్పోతామని గ్రామస్తులు ముందుకు రావడం లేదు. దీంతో పనులు నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ రెండు గ్రామాల్లో బైపాస్ రోడ్డు వేయడానికి రూ.7 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదించినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

మంత్రి చొరవ చూపినా..

లక్ష్మణచాంద పర్యటనకు వచ్చిన ప్రతిసారి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఈ రోడ్డు గురించి మాట్లాడుతూ రెండు గ్రామాల్లోని ప్రజలు సహకరిస్తే బైపాస్ రోడ్డు పూర్తవుతుందని అంటున్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం తరఫున పరిహారం అందిస్తామని పేర్కొంటున్నా.. ఈ రెండు గ్రామాల ప్రజలు ముందుకు రావడం లేదు.

అధికారులు స్పందించాలి..

మండలంలోని పలు గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఆసుపత్రి, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చివెళ్తుంటారు. రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లో బైపాస్ రోడ్డు పనులు చేపట్టి.. ఇబ్బందులను దూరం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఇబ్బందిగా ఉంది



మండలంలోని కనకాపూర్ నుంచి లక్ష్మణచాంద వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాని వడ్యాల్‌లో బైపాస్ రోడ్డు నిర్మించకపోవడంతో రెండు వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. – మోహన్, వడ్యాల్

బైపాస్ రోడ్డు పనులు చేపట్టాలి



నిత్యం వందాలది మంది వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో కొన్నిసార్లు రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులకు ఇబ్బంది అవుతోంది. అధికారులు వెంటనే బైపాస్ రోడ్డు నిర్మించాలి. – గంగాధర్, లక్ష్మణచాంద

ప్రతిపాదనలు పంపాం

వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లో బైపాస్ రోడ్డు నిర్మించే విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూస్తాం. – అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ఏజెంట్
నారాయణ: విరూపాక్ష

దళారులకు అమ్మి మోసపోవద్దు

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: రైతులు తమ పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుభీర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్వింటాల్‌కు రూ.1962 అందిస్తామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రేకుల గంగాచరణ్, మండల ఉపాధ్యక్షులు మోహినొద్దిన్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, అనిల్, పీరాజీ, గంగాధర్, మధు, మధుసూదన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.



కుభీర్‌లో పంట కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు

మాటేగాంలో..

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామంలో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంట కొనుగోలుకు ఆదేశాలు జారీ చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్ జేకే పటేల్, మండల ఉపాధ్యక్షులు గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్లు చంద్రకాంత్‌రెడ్డి, లస్మన్న, మధుసూదన్, సోలంకి భీంరావు, ముత్యంరెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



చామన్‌పెల్లిలో సాయం అందిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: వారంతా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదువుకున్నారు. తమతో కలిసి చదువుకున్న మండలంలోని చామన్‌పెల్లికి చెందిన రాజేశ్వర్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. మంగళవారం పదోతరగతి మిత్రులు చామన్‌పెల్లి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.పది వేలు సాయం అందించారు. కార్యక్రమంలో మల్లయ్య, గంగయ్య, మోహన్, లక్ష్మిరాజం, పోశెట్టి, దశరథ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ పాత్రికేయుడు కొరుకొప్పుల రాజాగౌడ్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం గ్రామ సర్పంచ్ సుక్కు రాజవ్వ–ముత్తన్న దంపతులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.పదివేలు సాయం అందించారు. కార్యక్రమంలో ముత్తన్న, సత్యనారాయణ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

భైంసాటౌన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘ సభ్యులు ఉన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు జిల్లా సర్పంచ్‌ల సంఘం మద్దతు



మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశ్

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యల పరిష్కరించాలని సమ్మె చేస్తున్న జీపీఎస్‌లకు అండగా ఉంటామని సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు వీరేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు జేపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మెకు సర్పంచ్‌ల సంఘం మద్దతు పలికింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి ఆరోగ్య బీమా అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు ముత్యంరెడ్డి, గంగారెడ్డి, అనిల్, అచ్యుత్‌రావు, శివయ్య, శ్రీవిద్య, పద్మాకర్, భూమేశ్వర్, మహేశ్, సత్తన్న, రాజమల్లు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం మంగళవారం ప్రారంభమైంది. పండితులు నర్ర నితీశ్, జగన్నాథం విజయ్, శరత్ చంద్ర శర్మ, బాసర వేదపండితులు కుసుంబ రఘు, నాంపెల్లి శ్రీరాం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా గణపతి పూజ, గౌరీపూజ, స్వస్తి పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, అంకురార్పణ, రక్షాబంధనం, రుత్విక్ వరణం, సర్వతోభద్ర మండప సహిత, నవగ్రహ, చతుర్‌షష్టి, క్షేత్రపాలక, మండప ఆరాధనంతో పాటు కుంకుమార్చన, స్థాపిత దేవతా హోమాలు, రుద్రహోమం, మూల మంత్ర హోమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్న సంతర్పణతోపాటు పురవీధుల గుండా ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు కొత్తపెల్లి సురేశ్, రాజన్న, అశోక్, రమేశ్, పాపారావు, అవ్వ బుచ్చన్న, శంకర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఈరోజు

విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట్ డాక్టర్స్ లైన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. సహకరించాలని కోరారు.

మంత్రి, ఎమ్మెల్యే పర్యటన

మామడ: మండలంలోని న్యూసాంగ్విలో బుధవారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సాయిబాబా ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొంటారని పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం మంత్రి ఐకేరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు.

కుంటాల: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మండలంలోని ఓలా గ్రామానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రానున్నట్లు సర్పంచ్ కనీష్‌ఫాతిమా ఓ ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామానికి చెందిన బాద్గుణ రాజు–ఇంద్ర దంపతుల కుమార్తె సాహిత్య ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించింది. లోకేశ్వరం కేజీబీవీలో చదువుతున్న సాహిత్యను మంగళవారం గ్రామస్తులు అభినందించారు.

నేడు ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో బుధవారం ఉదయం బీరప్ప దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని.. కుర్మ సంఘం సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఫోన్ అప్పగింత

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ప్రభాకర్ ఇటీవల తన ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు నూతన టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ కనిపెట్టి అతడికి అప్పగించినట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: కూచిపూడి నత్యంలో ప్రతిభ చూపిన పట్టణానికి చెందిన చిన్నారులు వై.ఆద్యారెడ్డి, వై.దీక్షిత‌రెడ్డిని వశిష్ఠ విద్యాసంస్థల అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్ మంగళవారం సన్మానించారు. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ, శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో వీరు డాన్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఫణీందర్‌రావు, కుమ్మరి సత్తయ్య, వశిష్ఠ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేశ్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

నామినీ వివరాల సేకరణ

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన షెవ్వ చిన్న భూమన్న(45) అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, ఏఈవో ఉమామహేశ్వరి బాధితుడి ఇంటికి వెళ్లి రైతుబీమా పొందేందుకు కావాల్సిన నామినీ వివరాలు సేకరించారు. సర్పంచ్ ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

పెంబి మండలంలో పర్యటన

పెంబి: మండల కేంద్రంతోపాటు నాగాపూర్, మందపల్లి, గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు భుక్య జాన్సన్‌నాయక్ పర్యటించారు. నాగాపూర్‌లో ఇటీవల మరణించిన పోతరాజు భీమయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు అందించారు. ఎంగ్లాపూర్ సర్పంచ్ వసంత్‌రావు తండ్రి మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం గిరిజనులు తమ సమస్యలను విన్నవించారు. వారి వెంట సరోజ, ఎంపీటీసీ రామారావు, గుడిసె రమేశ్ ఉన్నారు.

రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

ఖానాపూర్: తెలంగాణ బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన బీజేపీ మండలాధ్యక్షుడు టేకు ప్రకాశ్‌ను మంగళవారం పట్టణంలో ఆ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, చిలుకూరి గిరి, గోపాల్‌రెడ్డి, పుప్పాల ఉపేందర్, బుక్క వెంకటేశ్వర్లు, శివ, సదాశివ్, రాము, తదితరులు ఉన్నారు.

కంటివెలుగు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని 12వ వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నాకర్‌రావు, వైస్ చైర్మన్ కలీల్, షబ్బీర్‌పాషా, చిన్నం సత్యం, సలీంఖాన్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మచ్కల్‌లో..

ముధోల్: మండలంలోని మచ్కల్ గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ అశ్విని మైసాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు చేశారు. ఎంపీటీసీ ఆత్మస్వరూప్, మెడికల్ ఆఫీసర్ ఆయేషా, డీఈవో సాయినాథ్, రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

కుంటాల: మండల కేంద్రంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సర్పంచ్ కక్షతో ఒకరికి మాత్రమే నోటీసు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై డీపీవోకు ఫిర్యాదు చేశామని.. గ్రామస్తులందరికీ ఒకే న్యాయం ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, రమణారావు, గంగయ్య, సత్తయ్య, గజ్జారాం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిబిరం కొనసాగుతోంది. మంగళవారం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ నర్సయ్య సొంత డబ్బులతో అల్పాహారం అందజేశారు. విద్యార్థులు సకాలంలో హాజరై శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెంపుడు కుక్కకు పిండ ప్రదానం



మనిషి పుట్టుక నుంచి నేటి వరకు కేవలం పెంపుడు జంతువుగానే కాక స్నేహితునిగా మారిన జంతువు కుక్క. విశ్వాసానికి మారుపేరుగా తమ కుటుంబంలో కలిసిపోయి మరణించిన కుక్కకు వారు పిండప్రదానం చేసి గొప్ప మనసు చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ కాలనీకి చెందిన చంద్రే ప్రేమ్–నిఖిత దంపతులు రెండేళ్లుగా పెంచుకున్న కుక్క(జిమ్ము) ఇటీవల చనిపోయింది. దీంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుక్క ఆత్మశాంతి కోసం మంగళవారం పిండప్రదానం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నర్సరీ తనిఖీ చేసిన సీసీఎఫ్



నర్సరీ పరిశీలిస్తున్న శర్వాణన్

నర్సాపూర్(జి): మండల కేంద్రం శివారులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితనిధి వన నర్సరీని మంగళవారం (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సీసీఎఫ్ శర్వాణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా హరితనిధి వననర్సరీ, ఎఫ్ఎస్ఓ క్వార్టర్స్‌ల ప్రారంభోత్సవం ఉంటుందని.. అందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వారి వెంట ఎఫ్ఆర్ఓ జైపాల్ రెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి ఇర్ఫాన్, ఎఫ్‌బీఓ అనుపమ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

లోకేశ్వరం: రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధ్యానం విక్రయించిన వారం రోజుల్లోగా డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేశ్, గంగాధర్, బండి ప్రశాంత్, భోజన్న, దేవన్న తదితరులు పాల్గొన్నారు.